గాలి మేడ!

ఎవ్వరూ విడతీయలేని చిక్కు ప్రశ్న.

మనస్సులోని వ్యధను మరిపిస్తూ శరీరంలోని బడలిక ఎప్పుడు నిద్దర తెప్పించిందో తెలియదు కాని, రైలు కూత విని ఉలిక్కిపడి లేస్తే ప్రక్కన శ్యామల లేదు.

"పోలాయి!!" అని కేక పెట్టాడు.

"అమ్మగారు ఏరిరా?" అని అడిగాడు.

"అమ్మగారు" అంటూ ఏడుస్తూ వాడు రైలు పట్టాల వెంబడి పరుగెత్తాడు.

"దిండు దగ్గర మడత పెట్టిన కాగితం కనిపించింది.

బావా!

నేను వెళ్లిపోతున్నాను. ఎక్కడికి వెడుతున్నానో నాకు తెలియదు. నాకు తెలిసినదల్లా ఒక్కటే విషయం. విధి నాతో చెలగాటం ఆడింది. నేను వెళ్లవలసిన చోట నాకు ఆదరణ లేదు. నాకు ఆదరణ వున్న చోటుకు నేను వెళ్లలేను. అదే నా జీవితంలోని ఘోరమైన వ్యంగ్యం. అదే అంతులేని పరాజయం. చెడిపోయిన అవుటర్ సిగ్నల్ దగ్గర ఆగిపోయిన రైలు బండి నా బ్రతుకు. ఆ సిగ్నల్‌ని ఎవ్వరూ యీ జన్మలో బాగు చెయ్యలేదు. సెలవు బావా! సెలవు.

శ్యామల

"బాబుగారు శ్యామలమ్మగారు అవుటర్ సిగ్నల్ దగ్గర....." అంటూ పెద్దపెట్టున ఏడుస్తూ పోలాయి వస్తున్నాడు.

# అధ్యాయంలో ఒక పుట

మానవ జీవితం. అనేక జన్మల బృహత్ సంపుటం. ఒక్కొక్క జన్మ, ఒక్కొక్క అధ్యాయం. ఒక్కొక్క సంఘటన ఒక్కొక్క పుట.

అదృష్టవంతులకి పూర్వజన్మ సుకృతమేగాని, పూర్వజన్మ స్మృతులుండవు. శాపగ్రస్తులకి అవి అర్థం కాని పీడకలలాగా శాపవిముక్తి అయ్యేదాకా వెన్నంటి తరుముతూ మనస్సుకి, మనిషికి శాంతి లేకుండా చేస్తాయి.

శాప విముక్తి అయిననాడు పీడకల శాశ్వత అంధకారంలో కరిగిపోతుంది. ఈ జన్మ వెలుగే మిగులుతుంది.

ఆనాడు, అనేక యుగముల వెనక ఒకనాడు, హిందూ భాస్కరుడు, బౌద్ధ చంద్రుడు ఒకే పరి, విజ్ఞాన గగనంలో విలసిల్లిన ఆ సంధి యుగంలో, ముక్తి మార్గం కోసం ప్రజానీకం నాలుగు పుంతల నడిమి దోవలో నిలచి తమ గమ్యస్థానానికి అనువైన మార్గమేదో తెలియక, ఆరాటపడే ఆ రోజుల్లో.

ఒకనాడు గోధూళీ వేళలో, అలసి సొలసిన పధికుడెవ్వడో, చీకటినుంచి వెలుగు కోసం అన్వేషిస్తూ, సాధనకై, అవంతీపురం చేరిన ఆనాడు!

అవంతీపురంలో, నేనడుగు పెట్టేసరికే ఆదిత్యుడు, అస్తాచలం దాటి, తిమిర

కన్యను ఈ భువి పైకి వుసి గొలిపాడు. దుర్జనువి అపకీర్తిలాగా, ప్రపంచమంతటా చీకటి ఆవరించుకుంది. ఎన్నో దినాలుగా చేస్తున్నా ఈ ప్రయాణపు బడలిక గమ్యస్థానం చేరగానే దానంతటదే మనస్సుని వదిలినా, శరీరం మాత్రం ఎవరి పంచనైనా, ఈ రాత్రి తలదాచుకోగలిగితేనా! అని కోరుకుని, ఒక రమ్యసౌధం ఎదుట నిలబడినాను. ఎవరో పుణ్యాంగన సింహద్వారం వద్ద నిలబడి వుంది.

"అమ్మా" అని పిలిచాను.

"ఎవరదీ" అంటూ ఆవిడ పలికింది.

"పరదేశిని తల్లీ"

"రా నాయనా" అని లోపలికి పిలుచుకుని వెళ్ళింది. అది ఒక బౌద్ధ విహారం. కానీ ఎంతటి మార్పు ! ఆ తథాగతుడు బోధించిన బౌద్ధ మతమేనా వీరు ఈనాడు ఆచరించేది. అతడు చూసి, నడచిన, పుణ్యమార్గమేనా వీరు నడచేది? అని నాలో నేను వితర్కించుకుంటూ నిలబడ్డాను.

ఎదుట మాయాదేవి సుతుని సుందర విగ్రహం కంటబడినది. ఆ విగ్రహం ముందు ఎవరో పండు ముదుసలి మోకరిల్లి బుద్ధదేవుని వదనార విందాన్ని తిలకిస్తూ తన్మయుడవుతూ ప్రార్ధన చేస్తున్నాడు.

"పరదేశి వచ్చాడు" అంటూ ఆవిడ పలికింది.

"అతిధియా?"

"కాదు అభాగ్యవంతుడు"

"అయితే స్వయం విష్ణువే."

అంటూ నా వంక తిరిగి ఒక్కసారి చూశాడు. ఆ చూపులో ఎంత దయ! ఆ పలుకులో మార్దవం, ఆ ముఖంలో ప్రశాంతత చూడగానే. నా చేతులు వాటంతటవే ఆయనకు నమస్కరించాయి.

"ఉపగుప్తుడు మీకు నమస్కరిస్తున్నాడు.'

"అయుష్మాన్ భవ" కూర్చో నాయనా! అంటూ మళ్ళీ పూజలో లీనమయ్యారు.

వారి ఆతిధ్యం, వారి ఆదరణ వర్ణించడానికి నేవరిని- ఎన్ని జన్మలు వారి సేవ చేస్తే, ఆ ఋణం తీరుతుంది. ఆ తల్లి హస్తవాసి అటువంటిది. ఆ యింటికి వచ్చిన వ్యక్తి తన ఇంటినే మరిచిపోతాడు.

నాకు ఆతిధ్యమిచ్చినవారు సామాన్యులు కారు. నేను ఎవరికోసం ఇంతదూరం వచ్చానో, ఎవరి శుశ్రూషకోసం ఇన్ని ఇడుమలు పడ్డానో, ఆ గురుదేవులు శ్రీ సనాతనాచార్యులవారి పావనగృహమే అది. ఆయన ఇల్లాలే జగన్మాత మృణాళినీ దేవి. వారు భయులూ అవతరించిన పార్వతీ పరమేశ్వరులు.

భోజన సమయంలో "మీ పితృ దేవులు ఎవరు?" అని గురువుగారు ప్రశ్నించారు.

"పాటలీ పుత్రవాసి సోమగుప్తుడు మా తండ్రి."

"సోమగుప్తుని పుత్రుడవా, అతను మా ప్రియశిష్యుడు. అన్నదమ్ములెందరు?

"ఒక్కడనే"

"తోబుట్టువులు?"

"ఎవరూ లేరు"

"సోమగుప్తుడు అత్యంత ధర్మపరుడే. అతనికీ ఒక్కడేనా సంతానం?

"ధర్మముకన్న దానము బట్టి గదా సంతానము" అంటూ ఆవిడ పలికింది.

గురుదేవుని ముఖంలో బాధ కనిపించింది. ఒక నిట్టూర్పు హృదయం నుంచి వెలువడింది.

"చిరంజీవి ఏమీ తినడంలేదు"

"ఆకలి లేదు"

"ఎందుకని"?

"బిడ్డ అలసినట్లున్నాడు. విశ్రాంతికి ఏర్పాటుచేయి" అని ఆదేశం ఇవ్వగానే, వారి అనుజ్ఞ పొంది గురుపత్ని వెంట నడిచాను.

మెట్లుఎక్కి, రెండవ అంతస్థు చేరాను. అక్కడ పెద్ద ద్వారము బంధించి ఉంది. నేను అక్కడ ఆగబోయాను. కాని ఆవిడ ఇంకా పై అంతస్థుకి వెడుతూంటే, ఆవిడని అనుసరించి మూడో అంతస్థులోకి వెళ్లాను. చక్కటి గదులు మూడు ఉన్నాయి. అందంగా అలంకరింపబడి రాజప్రాసాదాలని గుర్తుకు తెచ్చేట్లుగా ఉన్నాయి. తూర్పు దిక్కున గది నాకు చూపి"ఇహ ఇక్కడే నీ బస" అని ఆవిడ చెప్పింది. మెత్తటి శయ్య నన్ను ఆహ్వానిస్తోంది. సమీపంలో వున్న నది నుంచి శీతల సమీరం నాకు మత్తెక్కిస్తోంది. కళ్ళు మూతలుబడుతున్నాయి. "నాయనా విశ్రమించు" అని ఆవిడ వెళ్ళిపోయింది.

గదిలో ఒక చోట తథాగతుని పాలరాతి విగ్రహం. తథాగతుని, అనుక్షణం మన కన్నులముందు నిల్పిన మహనీయుడు, ఆ శిల్పి ఎవరో? నిదుర మరచి ఒక్క క్షణం ఆ విగ్రహం వంకనే చూచాను. మనస్సుకి అంతులేని, ఆనందం కలిగింది. ఆ ఆహ్లాదాన్ని అణచుకోలేక మనస్సు తబ్బిబ్బులైంది.

అకస్మాత్తుగా నా నోటి వెంట 'మృత్యోవా అమృతం గమయా" అని వెలువడింది. ప్రకృతి అంతా నిశ్శబ్దం ఆవరించింది. తథాగతుని విగ్రహం నుంచి నా మాటలే మళ్ళీ ప్రతిధ్వనించాయి. "మృత్యోవా అమృతం గమయ."

మనస్సు గద్గదమైంది. అల్లాగే వెళ్ళి శయ్య చేరాను. ఎవరో స్త్రీ ఆ పక్క మీద పడుకుని వుంది. నేను నిర్ఘాంతపోయాను.

"ఎవరది?" అప్రు ప్రశ్నించాను.

ప్రక్కన పరచిన ధవళ వస్త్రం పక పక నవ్వింది. గాలికి రెప రెప లాడింది. బయట నిద్దరలో ఏదో పక్షి కలువరించింది. దూరంగా ఎవరిదో కిన్నెర కంఠం కోకిలతో పోటీకి వస్తోంది. శయ్య చేరాను. సన్నజాజులు, మాలతులు ఒక్కసారి గుప్పుమన్నవి.

మనస్సులో పాములు బుసకొట్టాయి.

ఎక్కడ వీ సువాసనలు? ఎందుకీ మధురానుభూతి?

ఇక్కడ శయనించిన ఈ చిన్నది ఎవరు? "ఎందుకీ యక్షప్రశ్నలు?" అని మనస్సు ప్రశ్నించింది. "అంతులేని కుతూహలం" అని మనస్సే సమాధనం చెప్పింది. నేను దరి చేరితే శయ్య శూన్యం. ఇది మనస్సుకి కలిగిన భ్రమ.

రేయి ఎన్ని ఝాములు గడిచిందో, నేను జాగృతికి సుషుప్తికి మధ్య ఉన్న సమయంలో ఎవరిదో మెత్తటి పాదం ఈ గదిలోకి నిశ్శబ్దంగా నడచి వచ్చింది. ఎవరో అందాలరాణి నాకు సమీపంగా నిలబడి నన్ను చూసి జాలిగా నవ్వింది. నేను కన్ను తెరిచేసరికి అక్కడ ఎవరూ లేదు - ఒక్క తథాగతుని నిశ్చల మూర్తి తప్ప. బొడ్డుమల్లెల వాసన ఒక్కసారి గుప్పుమంది.

వచ్చిన దెవరు? ఆశలు తీరకనే? ఆయువు తీరిన చిన్నారియా? మానవియా? మహామాయా? "నా కోసమే వచ్చిందా" అని ఆలోచన వచ్చేసరికి వళ్ళు ఝుల్లుమంది. వళ్ళంతా వణికిపోయింది. తథాగతుని వంక చూశాను. ఆయన ప్రసన్న వదనంలో చిరునవ్వు తొంగిచూస్తోంది.

"ఆ చిన్నారి వచ్చినది నన్ను కలుసుకోవటానికే," అని వారి ఆదేశం నా మనస్సున హత్తుకుంది. మళ్ళీ శయ్యచేరి కన్ను మూశాను. కన్ను తెరిచే సరికి ఆదిత్యుడు రక్త వస్త్రం వదిలి ధవళ వస్త్రం ధరించాడు.

"వత్సా" అని గురువర్యులు నన్ను మేల్కొలుపుతున్నారు. నేను ఉలిక్కిపడి లేచి వారికి నమస్కరించాను.

"ఆయుష్మాన్ భవ! బడలిక తీరిందా నాయనా" అని అన్నారు.

"క్షమించండి. బడలికతో ఆదమరచి నిదురపోయాను. ఆలస్యమయింది."

"పిచ్చివాడా! ఆత్మీయుల దగ్గరనా ఈ అరమరికలే... మీ అమ్మ నీ కోసం చూస్తోంది."

ఆనాటినుంచీ, ఎన్నో వసంతాలు గురువుల శుశ్రూషలో గడిచిపోయియి. కన్న బిడ్డ కన్న అధిక అనురాగంతో, నన్ను వారు మన్నిస్తుంటే, నాకు లోటేమిటి? కాని మనస్సుని వదలని శంక ఒకటి ఉండేది. ఎన్నోసార్లు గురుదేవుని అడిగి శంక తీర్చుకోవాలనే సంకల్పం కలిగింది కానీ,

ఆ సౌజన్యమూర్తిని చూడగానే, నా ప్రశ్నలు, అనుమానాలు క్షుద్రంగా తోచి, మనస్సుని వేదాంగ చర్చ పైకి మార్చుకునే వాడిని.

రెండవ అంతస్థు తలుపులు ఎందుకు సర్వదా మూసి ఉంటాయి?

ఒకనాడు, ఉద్యానవనంలో కూర్చుని, రెప్పవాల్చకుండా, ఆ మూసిన తలుపుల వంక చూస్తున్నాను.

"ఎవరిదో హస్తం నా భుజ.ం పైన పడ్డది.

ఉలిక్కిపడి అటు చూచాను. నేను తెప్పరిల్లి లేవబోతుంటే-

"కూర్చో. నాయనా? నీ మనస్సులోని ప్రశ్న నాకు తెలుసు. దానికి మనస్సే సమాధానం ఇస్తుందిలే" అని ఆయన నా తల నిమిరి అక్కడ నుంచి వెళ్ళిపోయారు.

సాయం సంధ్యలో ప్రకృతి అంతా మిల మిలలాడుతోంది. కల కల నాదంతో పక్షి గణం గూటికి చేరింది. అందరూ తమ తమ నెలవులకి వెళ్ళిపోతున్నారు. అర్థం కాని ఆరాటంలో కూర్చున్నది నేనే.

"ఉప గుప్తా!" అని గురుపత్ని పిలిచింది. లోపలికి వెళ్ళాను.

"అడిగి, గురుపాదుల మనస్సు నొప్పించకు. నీ శంక నివృత్తి అవుతుందిలే."

అని ఆవిడ అన్నది.

"అలాగేనమ్మా అడగను."

"అది వారి మనస్సుకి బాధ కలిగించే విషయం."-

"అయితే ఎప్పుడూ అడగను."

ఎన్నో వసంతాలు గడచిపోయాయి. నేను విద్య 'ముగించి పాటలీపుత్రం తిరిగి వెళ్ళిపోయే రోజులు దగ్గరకు వస్తున్నాయి. శిశిర ఋతువు వచ్చింది. పట్టపగలే దట్టపు మంచుతెరలు. ఈ తెరల వెనుక ఎక్కడో అనంత గగనాన భానుడు తన నిత్య యాత్ర నిరామయంగా జరిపినా, ఆ కరుణామూర్తి వాత్సల్య కిరణాలు మాత్రం భూమిని తాకీ తాకకుండా ఉన్నట్లున్న రోజుల్లో నదీ తీరానికి వెళ్ళి నిలబడ్డాను. ఎవరిదో నావ ఆయాసంగా నీటిమీద తేలిపోతూవుంటే,

ఇంటికి మరలిపోయే రోజులు జ్ఞప్తికి రాగానే, తల్లిదండ్రుల తలంపుతో మనస్సుకు ఉల్లాసం కలిగితే, తల్లితండ్రులను ఇంతకాలం మరిపించిన గురుదేవులను, గురుపత్నిని వదిలి ఎల్లా వెళ్లడం!

ఆరు ఘడియలుగా గడచిన ఈ ఆరు సంవత్సరాలలో, అవంతీపురం నాకెంత ఆత్మీయమైంది. ఎన్నో మధురానుభూతులు అనుభవాలు, శాశ్వతంగా స్మృతి పథంలో నిలచిపోయాయి.

"అనువైనప్పుడల్లా ఈ అవంతీ పురానికి రావాలి."

దూరంగా బౌద్ధ బిక్షువుల బృందం తధాగతుని లీలలని గానం చేస్తున్నారు. ఎందరో సుందరాంగులు గుంపుగా ఒక చోట నిలబడి ఉన్నారు.

తలలు బోడులైనా, తలపులు బోడులు కాని బౌద్ధభిక్షువులు తమ కోరికల అణచడానికి కొందరు, వ్యక్తపరచడానికి కొందరు తహ తహలాడుతుంటే-

ఒక సుందరాంగి ఏదో హాస్య ప్రసంగం చేసి ముందుకు సాగి ఒక భవనం దగ్గర, ఆగి నిలబడి, వెనుతిరిగి క్రీ గంట చూచితే, సంకేతం గ్రహించిన బౌద్ధ బిక్షువు "బిక్షాం దేహి" అంటూ ఆమెతో బాటు ఇంట్లోకి నడిచాడు.

ఆ చిన్నదాని చిరునవ్వుతో నా మనస్సున ఒక్క మెరుపు మెరిసింది.

"నా అలక ఏం చేస్తోందో!"

నేను ఇల్లు వదిలేప్పుడు 12 సంవత్సరాలు. ఈనాడు పద్దెనిమిది. నిండు పున్నమిని వెక్కిరించేటంత సుందరిగా మారి ఉంటుంది. నన్ను మరిచిపోయిందేమో: నా ప్రేమ విస్మరించిందేమో! వెళ్ళి పోవాలి. ఈ అవంతిపురం వదలి- నా చిన్ననాటి చెలి దగ్గరకు వెళ్లిపోవాలి.

ఆలోచనకంటే వేగంగా పాదంసాగి గురు గృహానికి చేరింది.

అక్కడ, ఈనాడు నిత్యానికి విరుద్ధంగా ఉంది. కాని, అనుక్షణం నిశ్శబ్దం ఆవరించి ఉండే రెండవ అంతస్థు తలుపులు ఈనాడు తెరిచి ఉన్నాయి.

నేను రెండవ అంతస్థు దగ్గరగ వచ్చి ఆగాను. ఇంతకాలం బంధించిన తలుపులు తెరచుకున్నాయి. లోపల ఒక పెద్ద గది. అతిధుల కోసం అలంకరిస్తున్నారు.

మంచు తెరలు మెల్లగా తొలిగాయి. ఒక్కసారి భువి అంతా వెలుగులో

నిండిపోయింది.

"ఉపగుప్తా" అని గురుదేవుల కంఠం పలికింది. నేనట చూడగానే,

"ఇంటి మీద మనస్సు మళ్ళింది కాదూ !"

గురువుల దగ్గరనా నా దాపరికం ! వారు సర్వజ్ఞులు. నేను తలవంచుకుని నిలబడ్డాను.

"ఆ చిన్నది నిన్ను మరిచిపోదులే. మీ దంపతులను తధాగతుడు ఆశీర్వదించుతాడులే." నేను మాట్లాడలేదు. మనస్సులో వారికి మొక్కి నిలబడ్డాను.

"ఈనాడు నా ప్రియ శిష్యులు, శిష్యురాండ్రు వస్తున్నారు. వారు నీలాగానే కొంతకాలం మా పంచను ఉండి. మమ్మల్ని తరింపచేశారు."

"ఎంతమాట!"

అతిధులు వచ్చారు. ఆరుగురు యువకులు ఆరుగురు యువతులు గురువుగారికి నమస్కరించి, వారు చూపించిన ఆసనాలమీద కూర్చున్నారు.

"రా ఉపగుప్త" అంటూ నన్ను ఆహ్వానించి, తన వరసన కూర్చో పెట్టుకుని, వచ్చిన వారందరిని నాకు ఎరుక పరచారు.

అందరూ గురువును మెప్పించిన శిష్యులే. కానీ, వారిలో నన్ను గాఢంగా ఆకర్షించిన వారు ఇద్దరే. అందరికన్న స్పురద్రూపి, కళాకారుడు, సిద్దార్ధుడు. అతివలలో అందరికన్నా మిన్న సునంద. సిద్దార్ధుని చూడగానే ఆ చిన్నదాని కనులు ఒకసారి మిల మిలా మెరిసితే, చిన్నవాడు మాత్రం ఒక్క చిరునవ్వుతోనే పలుకరించాడు.

"ఆచార్యదేవ!" అంటూ ఒక పురుష కంఠం పలికేసరికి ఒక్క క్షణం నిశ్శబ్దం ద్వారం ముంగిట రాజదూత నిలబడ్డాడు. గురువుగారిని సమీపించి నమస్కరించి

"ప్రభువులు తమకై వేచియున్నారు."

"ప్రభువులు వేచి యున్నారా? మాట ఇచ్చి మరచానే.. వస్తున్నాను.

"వత్సలారా, మహారాజ దర్శనానికి వెడుతున్నాను. త్వరలోనే తిరిగివస్తాను."

అంటూ బయలుదేరి వెడుతూ సిద్దార్ధుని దగ్గర ఒక్క క్షణం ఆగి-

"తథాగతుని స్మరించుకో- వారే నీకు జ్ఞానజ్యోతిని ప్రసాదించగలరు."

"ఇంతవరకూ, తమరినే స్మరించుకుంటూ వచ్చానే."

"నేనూ నీలాటి మానవుడినేగా- ఆపద తీర్చగలవాడు ఆ తథాగతుడేనయ్యా" అంటూ ఆయన బయటకు వెళ్ళి పోయారు.

ఇంతవరకు నిశ్శబ్దంగా ఉన్న ఆ మందిరమంతా, మిత్రుల పరిహాసాలతో నిండిపోయాయి.

ఈ ఉల్లాసంలో పాల్గొనక దూరంగా నిలచిపోయిన వ్యక్తులు ముగ్గురం- నేను - సునంద- సిద్దార్ధుడు.

అతను- ఎవరితో పలుకాడక అనంతంలోనికి చూస్తున్నాడు. అతని వంకనే కన్నార్పక ఆనందంతో చూస్తోంది సునంద. అందరిని వదిలి అతను దూరంగా నిలబడ్డాడు. మెల్లగా ఆ చిన్నది అతన్ని సమీపించి,

"సిద్ధో"

"అతను అల్లాగే నిలబడి ఉన్నాడు. సునంద మళ్ళీ పిలిచింది. కలలో నుంచి తెప్పరిల్లిన వాడిలాగా "ఆగండి ఆగండి" అని అన్నాడు. మందిరమంతా నిశ్శబ్దం. ఎవరో మెట్లెక్కి వస్తున్నారు. మెల్లిగా ద్వారం తెరుచుకుంది. గడపలో ఒక స్త్రీ నిలబడి ఉంది.

అనంత సౌందర్యరాసి, భువికి దిగి వచ్చిన దేవత లాగుంది. కానీ, కన్నులలో అంతులేని దుఃఖం, ముఖాన అంధుడికి సైతం అగుపించే వైధవ్యం చిహ్నం.

ఈ రమణీయ సుందరి భర్తృ విహీన భగవంతుని లీలలు ఎంత అసాధారణం. మంత్రముగ్దులం లాగా మేమంతా ఆవిడ చుట్టూ నిలబడ్డాం.

"నేను కళ్యాణిని" అని ఆవిడ పలికింది. మేమెవ్వరం బదులుపల్కలేదు.

"ఆచార్యులవారికి పూర్వం. ఈ మందిరంలో మేముండేవాళ్ళము. ఎంత మధురమైన రోజులవి, నా భర్త ఎప్పుడూ, ఇక్కడే కూర్చుని ప్రకృతి శోభను తిలకించేవారు. తన్మయులవుతూండేవారు. వారు రోగగ్రస్తు లయ్యారు. మూడు వసంతాలు వారికి సేవచేశాను. కానీ వారు కోలుకోలేదు. చివరకు మతిభ్రమించి, ఇదే తిధినాడు, ఇక్కడనుంచి క్రిందికి దూకి తథాగతుని సన్నిధి చేరారు.

ఆనాడే, ఈ ముఖం వెనక దాగివున్న దుఃఖాన్ని చూడగలిగాను. మనస్సుకి అయిష్టమైన ఈ బాధని మనకి దూరంగా తొలగించి, కళ్ళెదుట నుంచి దాచి, మరచిపోవటానికి ప్రయత్నం చేస్తున్నాం- కానీ ఈ దుఃఖం ఈ దారుణవేదన, ఆనందంతో, ఉల్లాసంతో తొణికిసలాడే ఈ మర్త్యులంతా, ఈ శాశ్వత దుఃఖాన్ని చూడవలసిందే.

అందుకనే, నా ఇంటిదగ్గర గోడ మీద "ఆయువు తీరిన వ్యక్తులారా! మనలో దాగి మనం దాచిన దుఃఖాన్ని చూద్దాం రండి" అని వ్రాయించాను.

ఒక పిల్ల కెవ్వున కేకవేసి ఒక అడుగు వెనక్కి నడచింది. "నీ వనుకున్నట్లుగానే, అందరూ నాకు కూడ మతి చలించిందని అపోహపడ్డారు. నన్ను ఈసడించడం మొదలుపెట్టారు. అందుకని ఆ అక్షరాలు చెరిపేయించాను. కానీ, దుఃఖానికి, బాధ్యులైన వారెవరైనా కనిపిస్తే, వారిని నా వెంట వచ్చి, మనం చూడకూడదని దాచిన దుఃఖం, చూడటానికి రమ్మని చెప్పేదాన్ని.

"మనమందరం దుఃఖానికి బాధ్యులమే" అని సిద్ధార్డుడు అన్నాడు.

"కాదు నాయనా! బాధ్యులైనవారు మాత్రమే దాన్ని గుర్తించగలరు" మనకు సమీపంలోనే పురుషుడు, స్త్రీకి చేసిన అపకారం చూడవచ్చును నా వెంట రండి చూపిస్తాను.' ' అని కల్యాణి అంది, ఎవ్వరూ మాట్లాడలేదు. కదల్లేదు. ఒక్కొక్కరి వంక ఆవిడ తేరిపార చూస్తుంటే, ఒక్కొక్కరే అక్కడనుంచి దూరంగా వెళ్ళిపోవడం మొదలు పెట్టారు.

సునంద - సిద్ధార్థ - కళ్యాణి మిగిలారు. పదండి అని సిద్ధార్థ అడుగు ముందుకు వేశాడు.

"వద్దు వద్దు నా మాట విను సిద్ధో..." నువ్వడికి వెడితే నాశనమైపోతావు అంటూ సునంద అడ్డం నిలచింది.

"వెళ్ళక తప్పదు"

"నా మాట వినవా?"

"వెడితే గానీ విముక్తి గలగదు."

"నన్ను నిజంగా ప్రేమిస్తే వెళ్ళవు"

"నన్నాపకు సునందా- నేను వెళ్ళక తప్పదు"

"అంతేనా"

"ఆ! అంతే"

వెక్కి వెక్కి ఏడుస్తూ ఆ చిన్నది తథాగతుని విగ్రహం వేపు తిరిగింది.

కళ్యాణి, సిద్ధార్థుడు బయలుదేరి రాచబాట వెంట నడచి, ఒక చిన్న ఇంటి దగ్గర ఆగారు.

"ఇది మా తల్లితండ్రులు నాకు ఇచ్చిన ఇల్లు, దీంట్లో నేను ఒంటరిగా ఉంటున్నాను" అని కళ్యాణి అంది.

"అది అసత్యం- మీకు తోడుగా ఇంకో స్త్రీ కూడా ఇక్కడే ఉంటోంది."

"అది ఎక్కడో దూరంగా ఇంకో ఇంట్లో ఉంటుంది. సహాయం కావలిస్తే చేసిపెడుతుంది. అంతే నిజంగా ఈ ఇంట్లో మరింకెవరూ లేరు."

"లోపలికి పదండి" అంటూ తలుపు తెరిచి లోపలికి వెళ్ళాడు.

"నేను చెప్పలేదా ఎవరూ లేరని"

'ఉన్నారని నేను చూపిస్తానుగా' అంటూ చిట్టచివరన ఉన్న ఇంకొక తలుపుతీసి, భూమిలోకి కట్టిన ఒక గదిలోకి మెట్లు దిగి వెళ్ళాడు. కళ్యాణి గూడ అతన్ని అనుసరించింది. ఆ గది నానుకుని ఇంకొక గది ఉంది. దాని తలుపు బంధింపబడి ఉంది. లోపలినుంచి, అమానుషమైన ఆర్తనాదం వినిపిస్తోంది. గాయపడి, వలలో చిక్కుకుని తప్పించుకోవటానికి వీలులేక చావలేక, గిగిలలాగుతున్న జంతువులు చేసే ఆర్తనాదం అది. అతను తలుపు దగ్గరకు వెళ్ళి తలుపు తీయబోతూంటే, ఆవిడ గుమ్మానికి అడ్డుగా నిలబడి

"ఒక్కమాట విను నాయనా. నువ్వు చిన్నవాడివి. అఖండ ప్రతిభావంతుడివి. ఆ గదిలోకి వెళ్ళేవా నీ యవ్వనం పోతుంది. నీ ప్రతిభ నశిస్తుంది. నా మాట విని తిరిగి వెళ్ళిపో."

"శాపం నుంచి పారిపోయినంత మాత్రాన విముక్తి కలుగుతుందా !"అంటూ ఆ గదిలోకి వెళ్ళి తిరిగి తలుపు బంధించాడు.

అంతా నిశ్శబ్దం. లోపలినుంచి వచ్చే ఆర్తనాదం ఆగిపోయింది. క్షణాలు ఘడియలు గడిచిపోతున్నాయి. కాని సిద్ధార్థుడి జాడలేదు. ఆవిడకి అంతులేని భయం వేసింది. తనకోసం కాదు. తనమాట విని, తనవెంట వచ్చిన ఈ యువకుడికోసం. ఏమైనాడో, ఎల్లా ఉన్నాడో, మనస్సు నిలవదొక్కుకోలేక ఆ తలుపు తీసి చూసింది.

లోపల గదిలో, శయ్యమీద ఇరవై సంవత్సరాల యువతి పడుకుంది, జుట్టు జడలు కట్టుకునిపోయింది. ముఖం వివర్ణమైంది. వికృతమైన ఆర్తనాదం మళ్ళీ వచ్చింది. సిద్ధార్థుడు పక్క మీద కూర్చుని ఆ పిల్లచేతిని తన చేతిలోనికి తీసుకున్నాడు. ఆర్తనాదం ఆగింది. ముఖం ప్రసన్నం ప్రశాంతం అయ్యింది. తలుపు, దగ్గరగా మూసి కళ్యాణి బయటికి వచ్చింది. మనస్సెంతో తేలిక అయ్యింది. అంతులేని ఆనందం మనస్సున ముసలింది.

దూరంగా ఎవరిదో అమృతవాణి "మృత్యోర్మా అమృతం గమయ" అంటూ

తథాగతుని కొనియాడుతోంది. ఆ వాణి ఎక్కడిదో కాదు. అది అంతర్వాణి. చీకటి నుంచి వెలుగు వచ్చింది. వెలుగులో, వెన్నెల వచ్చింది. వెన్నెలతోబాటు ఎన్నో జన్మలగాధ కన్నులకు కట్టింది. తను, సిద్ధార్థ, లోపలవున్న చిన్నది ఎన్నో జన్మలలో కలిశారు. ఒక జన్మలో ఆనందాన్ని మరో జన్మలో దుఃఖాన్ని, వేరొక జన్మలో వియోగాన్ని, ఇల్లా రకరకాల అవస్థలలో ఊహకందనివి, కాని మనస్సు గ్రహించగలిగినవి, స్థితులలో తాము గడిపిన గాధలు, పొందిన అవతారాలు, అన్నీ కళ్ళకు కట్టినాయి.

వెన్నెల వెళ్ళి, వెలుగు వచ్చింది. వెలుగు పోయి చీకటి వచ్చింది. జాగృతిపోయి సుషుప్తి వచ్చింది.

మనస్సుకి ఎనలేని ఆనందం కలిగింది. బాధలన్నీ తొలిగి, మనస్సు మల్లెకన్న తేలిక అయింది.

"ఈ పృధ్విపై ఇదే ఆఖరి కలయిక." అని మనస్సు వక్కాణించింది.

అవునని ఆత్మ పలికింది.

తలుపు తీసి లోపలికి వెళ్ళింది. చిన్నదాని ముఖంలో చిరునవ్వు, కనురెప్పలు మూతలుపడి ఉన్నాయి.ఆమె సరసనే కూర్చున్న సిద్ధార్థుని చేతిలో ఆ చిన్నదాని చెయ్యి, కళ్యాణి వంక చూసి మళ్ళీ ఆ పిల్లవంక చూశాడు.

కన్ను తెరచి ఈ ఇద్దరినీ చూసింది. ఆమె "రజనీ! నువ్వు మరణించావు" అని సిద్ధార్థతో అంది.

"సుకేశినీ నువ్వూ మరణించావు" అని కళ్యాణితో అంది.

"నేను మరణించాను" అని తనూ నవ్వుచిందించింది.

"విరూపా" అని సిద్ధార్థుడు పిలిచాడు.

"ఇదే ఆఖరి మృత్యువు - రజనీ మనకిక కలయిక లేదు."

"జన్మ జన్మాంతర సఖీ! నన్ను వదిలి వెళ్ళిపోతావా!

"యుగముగాల ప్రియా ! ఇదే వీడ్కోలు, కానీ నేనుండేది ఎన్నటికీ నీ సరసనే. చిరునవ్వు నవ్వి. అతని చేయి విడిచింది. కనురెప్పలు మూతలుపడినాయి. ఆ ముఖంలో ఏదో అలౌకిక ఆనందం ప్రస్ఫుటమౌతోంది.

"అమృతం గమయ" అని సిద్ధార్థుడు పలికి, కళ్యాణితో బయటకు వచ్చాడు.

ఒక్క క్షణం ఇద్దరూ మాట్లాడలేదు.

పురుషుడు స్త్రీకి చేయగలిగిన అపకారానికి నిదర్శనం ఇదే. నీ సఖి ఈ జన్మలో సనాతనాచార్యులవారి కన్యగా అవతరించింది. మనస్సు పుచ్చుకున్న మనసైన మగవాడు మృత్యువుకు కైవసమయ్యేసరికి, మందభాగ్యురాలు మతి మాలినదైనది. ఇలాగే ఈ వాడలోనే ఇంకో ఇంట్లో, స్త్రీ, పురుషుడికి చేసిన అపకారానికి ఫలితం చూడవచ్చు. వెళితే, చూడగలిగితే, దాచిన దాగని దుఃఖం అదే బోధపడుతుంది." అని కళ్యాణి అంది.

"విరూప మనం మరణించమని చెప్పిందే" అని సిద్ధార్థుడు ప్రశ్నించాడు.

మరణించింది మనం కాదు. మన పూర్వ జన్మ స్మృతులు."

ఇద్దరూ మౌనంగా, గురువుగారి ఇంటికి నడిచి వచ్చారు. రెండవ అంతస్థులోంచి పరిహాసాలు ఉల్లాసాలు ఇంకా వినిపిస్తున్నాయి.

ఇద్దరూ ఒక్క క్షణం ఆగారు.

"చిరంజీవీ ! ఈ భువిలో మనకిదే ఆఖరి కలయిక, లోపలికి వెళ్ళు" అని కళ్యాణి అంది.

అతని ముఖం వివర్ణమైంది.

"నేనెక్కడికిహ వెళ్ళలేను. వాళ్ళంతా నవ్వుతున్నారు."

"కానీ, నీ సునంద నవ్వటంలేదుగా"

"నిజమే నవ్వటంలేదు."

మెల్లిమెల్లిగా ఒక్కొక్క మెట్టే ఎక్కి రెండవ అంతస్థు చేరాడు.

కళ్యాణి వెనుతిరిగి నడిచి దూరంగా వెళ్ళిపోతోంది.

తలుపుతీసి లోపలికి వెళ్ళాడు. కన్నీరునిండిన కళ్ళతో సునంద ఇతని కోసం ఎదురుచూస్తోంది.

ఇతను కంటపడగానే. ఆనందంతో కళ్ళు మిలా మిలా మెరిశాయి.

సిద్ధార్థుడు తథాగతుని విగ్రహం ముందు మోకరిల్లాడు.

సునందగూడ అతని ప్రక్కనే మోకరిల్లి "సిద్ధో" అని పిలిచింది.

ఆ చిన్నదాని వంక అతను చూశాడు. ఆ కళ్ళల్లో ఆనందం, పెదిమలమీద చిరునవ్వు.

"మనల నెవ్వరూ ఇహ వేరు చేయలేరు సునందా" అని అన్నాడు.

ఆ చిన్నది అతనివంకనే చూస్తోంది.

అతను తథాగతుని వంక నిమీలిత నేత్రుడై మోకరిల్లితే, అప్పుడే రాజప్రసాదంనుంచి తిరిగి వచ్చిన గురుదేవులు.

ఈ జంటని ఆశీర్వదించుతూ వుంటే శిష్యగణం

బుద్ధం । శరణం గచ్ఛామి ।

ధర్మం । శరణం గచ్ఛామి ।

సంఘం । శరణం గచ్ఛామి ।

అంటూ ప్రార్థన మొదలుపెట్టారు.

## భ్రష్టస్య కావాగతిః

పునరపి జననం !

పునరపి మరణం !

ఈ మాటే రోజుకు లెక్కలేనన్నిసార్లు అంటూ వుంటాడు పువ్వుల సాహెబ్ అబ్బు భాయిస్ ! వయస్సు తొమ్మిది పదులు దాటినా యింకా పసివాడుగానే కనిపిస్తాడు. ముస్లిమ్‌ల యింట జన్మ ఎత్తినా, ఎందుకనో అతగాడు చిన్నప్పటినుంచి అంబికా భక్తుడైయ్యాడు. ఈ ధోరణి చూసి తల్లి తండ్రులు, గాలి ధూళి సోకిందేమోనని భయపడి ఫకీరులకు సాధువులకు చూపించారు. వాళ్లు ఇతనిని చూసి రోగం లేనివాడికి వైద్యం